క్లుప్తంగా

వర్షాల కోసం జలాభిషేకం

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లోని శివాలయం, దుర్గామాత ఆలయాల్లో రైతులు దేవతా విగ్రహాలకు జలాభిషేకం చేశారు. సోమవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాలు బాగా కురిసి పంటలు అధికంగా పండాలని ప్రత్యేక పూజలు చేశామన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను పంచారు. కార్యక్రమంలో అర్చకుడు మహేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మండల ఏఓగా దీపిక



నర్సాపూర్: మండల వ్యవసాయాధికారిగా దీపిక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారిగా పని చేశారు.

నేడు పంటల సాగుపై అవగాహన

వానాకాలం పంటల సాగుపై మంగళవారం రైతు వేదికలో అవగాహన కార్యక్రమం ఉంటుందని మండల వ్యవసాయాధికారి దీపిక చెప్పారు. రైతు నేస్తంలో భాగంగా రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ సెక్రటరీ రఘునందన్‌రావు పాల్గొని రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు.

ప్రభుత్వ వసతులు వినియోగించుకోవాలి

నర్సాపూర్: ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు సద్వినియోగం చేసుకోవాలని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ రవీందర్ కోరారు. ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న పాఠ్యపుస్తకాలను సోమవారం తమ కాలేజీలో పంపిణీ చేశామని చెప్పారు. ప్రభుత్వ కాలేజీల్లో చదివే పేద విద్యార్థులకు హాస్టల్ వసతి ఉందని తెలిపారు. కార్యక్రమంలో లెక్చరర్లు రాజేశ్వర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వేలంపాటకు స్పందన కరువు



ఖాళీగా ఉన్న కుర్చీలు

వెల్దుర్తి(తూప్రాన్): పీఏసీఎస్ నిర్మించిన దుకాణ సముదాయాలు, గోదాం, ధర్మకాంట అద్దెకు ఇవ్వడం కోసం సోమవారం సొసైటీలో నిర్వహించిన వేలంపాటకు స్పందన కరువైంది. పది దుకాణాలు ఉండగా అందులో మూడు దుకాణాలకు సంబంధించి ఇద్దరు, ధర్మకాంటకు ఒక్కరు దరావత్ చెల్లించారు. 1500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాంకు సంబంధించి ఒక్కరు కూడా దరావత్ చెల్లించలేదు. దుకాణాలు, ధర్మాకాంట, గోదాంలు అద్దె విషయమై సొసైటీ తరఫున సరైన ప్రచారం చేయకపోవడం, అడ్వాన్స్ మార్కెట్‌లో కంటే చాలా అధికంగా ఉండడంతో ఎవరూ కూడా ఆసక్తి చూపనట్లు తెలిసింది. వారం రోజుల తర్వాత అద్దె కిరాయిలు, అడ్వాన్స్‌లు సవరించి మరోసారి వేలంపాట నిర్వహిస్తామని సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి, సీఈఓ సిద్దయ్య తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి: ఎంపీడీఓ



పెద్దశంకరంపేటలో గ్రామ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా గ్రామ కార్యదర్శులకు సూచించారు. సోమవారం వారితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వేను పూర్తి చేయాలని, హరితహారం, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు లేకుండా చూడాలన్నారు. మార్గదర్శకాలు రాగానే మరుగుదొడ్లపై సర్వే వివరాలను చేపట్టాలన్నారు.

కళాశాలకు ఫ్యాన్ల బహూకరణ



కళాశాలకు ఫ్యాన్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): పట్టణానికి నూతనంగా మంజూరైన సాంఘీక సంక్షేమశాఖ డిగ్రీ బాలికల గురుకుల కళాశాలకు సోమవారం మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ పది సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. కళాశాలకు భగీరథ కనెక్షన్ ఇప్పించడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరిస్తామని ప్రిన్సిపాల్ శరీషకు చైర్మన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధిహామీతో కాల్వలకు మోక్షం

- మండలంలో 45 చెరువుల కాల్వల పూడికతీత పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

కొల్చారం(నర్సాపూర్): పొలాలకు నీరు అందించే చెరువులు, కుంటలు ప్రస్తుతం ఎక్కడికి అక్కడ కబ్జాకు గురయ్యాయి. వర్షానికి నిండిన నీటిని చెరువు తూముల ద్వారా ఆయకట్టు పొలాలకు నీరు అందించేందుకు ఏర్పాటు చేసిన పంట కాల్వలు సైతం కబ్జా కోరల్లో చిక్కిపోయాయి. దీంతో ఆయకట్టు పొలాలకు అవసరమైన సాగునీరు అందించే పరిస్థితి లేదు. ప్రస్తుత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పంట కాల్వల పునరుద్ధరణ పనుల కోసం చర్యలు తీసుకోవడంతో కొల్చారం మండల రైతులు హర్షం వ్యకం చేస్తున్నారు.

కూలీలతో కాల్వల పునరుద్ధరణ

కొల్చారం మండల వ్యాప్తంగా దాదాపు 135 చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటికి సంబంధించిన ఫీడర్ కాల్వలు చాలా మేరకు దెబ్బతినగా మిషన్ కాకతీయ పథకం ద్వారా కొంత వరకు కాల్వల పునరుద్ధరణ పనులు చేశారు. అవి కొంత దూరం వరకే చేపట్టడంతో అక్కడి నుంచి పొలాలకు వెళ్లే కాల్వ నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడం పొలాలకు నీరు అందని పరిస్థితులు నెలకొన్నాయి. ఉపాధి హామీ పనికి వ్యవసాయం అనుసంధానం చేయడంతో పంట కాల్వల పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. మొదటి దశలో మండల వ్యాప్తంగా గ్రామానికి రెండు చొప్పున 45 చెరువులను కుంటలను ఎంపిక చేశారు. నీటిపారుదల శాఖ, రెవెన్యూ అధికారుల సహకారంతో మొదటగా కాల్వల గుర్తింపు, ఇబ్బందులు తలెత్తని కాల్వల పూడికతీత పనులు చేస్తున్నారు. ఇప్పటివరకు 15 పూడికతీత పనులు పూర్తవగా, మరో 10 కాల్వలు పనులు కొనసాగుతున్నాయి. మిగతా వాటిని సైతం ఈ నెలాఖరు వరకు పూర్తి చేయనున్నట్లు ఉపాధి హామీ సిబ్బంది తెలిపారు.



రంగంపేట పెద్ద చెరువు పంట కాల్వ పూడికతీత పనులు, (ఇన్‌సెట్) కొంగోడులో పూడిక తీత తర్వాత పొలాలకు నేరుగా వెళ్తున్న నీరు

ఎదురవుతున్న ఇబ్బందులు

కొన్ని గ్రామాల్లో పంట కాల్వల పూడిక తీసే క్రమంలో కాల్వకు ఇరువైపుల నుంచి వచ్చిన రైతులు అడ్డు చెబుతుండడం, పనులను ముందుకు సాగించలేక పోతున్నామని ఉపాధి హామీ సిబ్బంది చెప్తున్నారు. ఇలా అయితే చివరి ఆయకట్టు వరకు ఉన్న పొలాలకు నీరందని పరిస్థితులు నెలకొంటాయి.

సర్వే చేయాలి



పంట కాల్వల పూడికతీత, పునరుద్ధరణతో ఆయకట్టు రైతులకు ఎంతో మేలు. అయితే కాల్వలు తీసే క్రమంలో కొంతమంది రైతులు అడ్డు చెప్పడం ఇబ్బందికరంగా ఉంది. ఇదే విషయం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పూర్తిస్థాయిలో సర్వే చేసి అడ్డంకులు లేకుండా అనుమతులు ఇస్తే మరిన్ని చెరువులు, కుంటల కింద ఉన్న పంట కాల్వలను పునరుద్ధరించే అవకాశం ఉంటుంది. – లక్ష్మీనర్సింలు, ఎంపీడీఓ కొల్చారం

కబ్జాకు గురవుతున్న నల్లకుంట

చేగుంట(తూప్రాన్): అధికారుల నిర్లక్ష్యంతో నల్ల కుంట కబ్జాకు గురై కుంట కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని రుక్మాపూర్ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని కుంటల్లో ఒకటైన నల్లకుంట సుమారు ఐదు ఎకరాల పరిధిలో ఉంది. రెండేళ్లుగా కొందరు రైతులు కుంట స్థలాన్ని కబ్జాచేసి వ్యవసాయ పొలాలుగా మారుస్తున్నారు. అప్పటి నుంచి ఇరిగేషన్ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదులు చేసినా.. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో సగానికిపైగా కుంట కబ్జాకు గురైనట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుంటను కబ్జాదారుల నుంచి కాపాడాలని, లేదంటే మండల కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసన చేపడతామని గ్రామస్తులు పేర్కొన్నారు.



రుక్మాపూర్‌లో కబ్జాకు గురైన నల్లకుంట

మరొకరు రిమాండ్

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో ఇటీవల ఇరువర్గాల ఘర్షణకు కారణమైన మరో వ్యక్తిని ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్ చేశామని ఎస్పీ బాలస్వామి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండువర్గాల మధ్య జరిగిన అల్లర్లలో ఒక వ్యక్తిని కత్తితో గాయపరచిన పట్టణానికి చెందిన మహ్మద్ అబ్దుల్ అతీఖ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ పంపించామన్నారు. గొడవలకు సంబంధించిన అన్ని వీడియోలు ఉన్నాయని, వాటి ఆధారంగా నిందితులను గుర్తించామని చెప్పారు. గొడవలకు సంబంధించి విచారణ జరుగుతుందని, ఎవరిని విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

రామాయంపేట(మెదక్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీవార్డులో రూ. పది లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ దేవేందర్, మేనేజర్ శ్రీనివాస్, ఏఈలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ కార్యవర్గ ఎన్నిక

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట గ్రామ వీహెచ్‌పీ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. కమిటీ ప్రఖండ అధ్యక్షుడిగా తాటిపల్లి శ్రీనివాస్, సంయోజక్‌గా రమణ, సహాస యోజకులుగా సందీప్, వంశీ, విద్యార్థి ప్రముఖ్‌గా శివసాయి,సహా ప్రముఖులుగా చంద్రశేఖర్, దినేశ్, గోరక్ష ప్రముఖ్‌గా శ్రీనివాస్, తదితరులను ఎన్నుకున్నారు. సమావేశంలో వీహెచ్‌పీ విభాగ్ సంఘటనా కార్యదర్శి మల్లేశం పాల్గొన్నారు.

ఆర్థిక కారణాలతో పెళ్లి నిశ్చయం

పెళ్లిని ఆపి.. బాలికను పాఠశాలలో చేర్పించిన అధికారులు

కొల్చారం(నర్సాపూర్): ఆర్థిక ఇబ్బందులతో బాలికను చదువును మధ్యలోనే ఆపి బాలికకు తల్లిదండ్రులు పెళ్లీడు రాకముందే పెళ్లి నిశ్చయించారు. ఇది తెలుసుకున్న అధికారులు పెళ్లి నిశ్చయాన్ని అడ్డుకొని బాలికను బడిలో చేర్పించారు. ఈ సంఘటన మండలంలోని సంగాయిపేట గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన విఠల్ అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబ పోషణకు ఆర్థిక భారం అడ్డు కావడంతో 7వ తరగతి చదువుతున్న బాలికను మధ్యలోనే బడి మాన్పించారు. పెళ్లిచేసి భారం దించుకుందామని ఆమెకు పెళ్లిని నిశ్చయించారు. ఆదివారం ఆలస్యంగా విషయం తెలుసుకున్న ఎంపీడీఓ లక్ష్మీనర్సింలు సోమవారం ఉదయమే గ్రామానికి చేరుకొని, అంగన్‌వాడీ టీచర్ల సాయంతో బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆమె చదువుకు పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. అక్కడి నుంచి బాలికను మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, హైమావతి, లింగమణి, పంచాయతీ కార్యదర్శి నాగరత్నం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బాలికను పాఠశాలలో చేర్పిస్తున్న అధికారులు

మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలి

నర్సాపూర్: బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర ప్రకారం తమ భూములకు పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. తమ గ్రామం మీదుగా సంగారెడ్డి కాల్వ నిర్మించేందుకు తమ భూములు ఇవ్వాలని తమకు ప్రభుత్వం నోటీసులు ఇచ్చిందని శివ్వంపేట మండలంలోని పెద్దగొట్టిముక్కుల రైతులు తెలిపారు. ఈ సందర్భంగా వారు తమకు న్యాయం చేయాలని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమ భూమికి భూమి పరిహారంగా ఇవ్వాలని, బహిరంగ మార్కెట్‌లో తమ గ్రామ పరిధిలో ఎకర భూమికి సుమారు రూ.రెండు కోట్ల వరకు ధర పలుకుతుందని వివరించారు. మార్కెట్ ధర ప్రకారం తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పెద్దగొట్టిముక్కుల రైతులు శ్రీశైలం, నర్సింలు, ఐలయ్య, ఇంద్రారెడ్డి, కృష్ణ, యాదగిరి పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పెద్దగొట్టిముక్కుల గ్రామ రైతులు

పరిశుభ్రత పాటించని వారిపై చర్యలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలోని చికెన్, మటన్ దుకాణదారులు ఇష్టరాజ్యంగా వదిలేస్తున్న వ్యర్థాలపై 'సాక్షి' దినపత్రికలో సోమవారం 'దుర్వాసనతో ఇబ్బందులు' కథనం ప్రచురితమైంది. దీంతో పంచాయతీ కార్యదర్శి రమాదేవి మాంసం విక్రయాల సముదాయాలను పరిశీలించారు. ఇష్టరాజ్యంగా జీవాల వ్యర్థాలు బయటకు వదిలేస్తుండడంపై వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశుభ్రత పాటించకుండా, వ్యర్థాలను ఇష్టరాజ్యంగా వేస్తే సంబంధిత వ్యాపారులపై చర్యలు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాంసం దుకాణాదారులకు సూచనలు చేస్తున్న కార్యదర్శి రమాదేవి

సాక్షి ఎఫెక్ట్

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

చిన్నశంకరంపేట (మెదక్): మండలంలోని అంబాజిపేట గ్రామంలోని కుర్మవాడ, చాకలివాడలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఎంపీఓ కలిముల్ల తెలిపారు. సోమవారం 'సాక్షి'లో అంబాజిపేటలో తాగునీటి తిప్పలు కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆయన గ్రామ కార్యదర్శి భావానితో కలిసి స్థానికులతో మాట్లాడారు. తమ వాడలో ఉన్న బోరు మోటార్ పాడైపోయిందని, వెంటనే రిపేర్ చేయించాలని ప్రజలు కోరారు. త్వరలోనే మరో బోరుమోటార్ కూడా రిపేర్ చేయిస్తామని ఎంపీఓ వారికి హామీ ఇచ్చారు.



అంబాజిపేటలో పాడైపోయిన బోరును పరిశీలిస్తున్న ఎంపీఓ కలిముల్ల

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

నర్సాపూర్ రూరల్: గుండెపోటుతో మృతి చెందిన మండలంలోని జక్కపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ మృతదేహం వద్ద సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ, వెంకట్రాంరెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. శ్రీనివాస్ కుటుంబానికి నిరంతరం అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్రగౌడ్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్, పార్టీ జిల్లా నాయకుడు సింగయిపల్లి గోపి, భిక్షపతి తదితరులు ఉన్నారు. అలాగే బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ఓదార్చారు.

డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు

చేగుంట(తూప్రాన్): యువత డ్రగ్స్‌కు బానిసలు కావొద్దని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్ నాయుడు మాట్లాడుతూ.. ఇటీవల యువత డ్రగ్స్‌కు బానిసలుగా మారడంతో సమాజంలో ఇబ్బంది కరమైన పరిస్థితులు వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రమోద్‌కుమార్, కళాశాల లెక్చరర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జరిగే అనర్థాలపై అవగాహన

మనోహరాబాద్(తూప్రాన్): సమాజంలో డ్రగ్స్ వల్ల జరిగే అనర్థాలపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. మండలంలోని కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ తెరపై చిత్రాలను, వీడియోలను ప్రదర్శించారు.



చేగుంటలో ర్యాలీ చేస్తున్న కళాశాల విద్యార్థులు

సంక్షిప్త వార్తలు

◆ నేడు నర్సాపూర్‌లో రైతు అవగాహన సదస్సు

మనోహరాబాద్(తూప్రాన్): నేడు నర్సాపూర్‌లో జరిగే రైతు నేస్తం సదస్సులో వ్యవసాయ శాఖ మంత్రి వస్తారని మండల వ్యవసాయ అధికారి స్రవంతి అన్నారు. సోమవారం మనోహరాబాద్‌లో ఆమె మాట్లాడుతూ.. మండలం నుంచి రైతులు నర్సాపూర్‌కు తరలిరావాలని రైతు అవగాహన సదస్సు ను విజయవంతం చేయాలని నిచ్చారు. అంతకు ముందు జీడిపల్లి గ్రామంలో జీలుగు పంటలను పరిశీలించారు. వీరి వెంట ఏఈఓ సచిన్ తదితరులున్నారు.

◆ దండోరా రజతోత్సవాలకు రండి

కొల్చారం(నర్సాపూర్): హైదరాబాదులోని రవీంద్ర భారతిలో జూలై 7న జరిగే దండోరా రజతోత్సవాలకు మాదిగ, మాదిగ ఉపకులాలకు చెందిన వివిధ రంగాల్లో ఉన్న వారు రావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని సంగాయిపేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రజతోత్సవ కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సంజీవయ్య, మహేశ్, బాలరాజు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ దాడిఘటనపై కేసు నమోదు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఆరెగూడెంలో ఆదివారం ఇరువర్గాలు దాడి చేసుకున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ నవత తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొడె మాధవి తాను కొనుగోలు చేసిన స్థలంలో ఇల్లు నిర్మించుకోగా అందులో కొంతభాగం తనదంటూ గ్రామానికి చెందిన గోవింద్‌రెడ్డి అనే వ్యక్తి ఇబ్బందులకు గురిచేశాడన్నారు. అతని మాట వినకపోవడంతో మాధవి ఇంటి ఎదుట గడిమైసమ్మ ఆలయం ఉండేదని వేధింపులకు గురిచేశాడన్నారు. ఈ విషయమై ఆదివారం గోవింద్‌రెడ్డి వెల్దుర్తి, ఆరెగూడెం గ్రామానికి చెందిన పలువురితో కలిసి దాడి చేశారని అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

◆ ట్రాన్స్‌ఫార్మర్ తొలగించండి

మెదక్ కలెక్టరేట్: ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే తొలగించాలని పట్టణంలోని సంజీవయ్య కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిరసన తెలిపి అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సంజీవయ్య కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ శిథిలావస్థకు చేరి కూలిపోయే పరిస్థితిలో ఉందన్నారు. అంగన్‌వాడీలో చిన్నారులు ఉంటారని, వారికి ఏ ప్రమాదం జరుగక ముందే తక్షణమే అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు నాగమణి, సాయిబాబా, ఉస్మాన్, నవీన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ మిషన్ భగీరథ నీళ్లు రాక 14 రోజులు

పాపన్నపేట(మెదక్): వానకాలంలోను తాగు నీటి తిప్పలు తప్పడం లేదు. కరెంట్ అధికారులు చేసిన తప్పు ప్రజలకు ముప్పుగా మారింది. ఇటీవల వీచిన గాలి దుమారానికి యూసుఫ్‌పేట వద్ద విద్యుత్ పోల్‌లు నేల కూలాయి. వాటిని వేసే క్రమంలో విద్యుత్ సిబ్బంది గోతులు తవ్విన ప్పుడు, మిషన్ భగీరథ పైపులు పగిలి పోయినట్టు ఆరెపల్లి మాజీ సర్పంచ్ శ్రీనాథ్ తెలిపారు. మిషన్ భగీరథ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పలు గ్రామాలకు తాగునీరు రావడం లేదు. 14 రోజులుగా మండల పరిధిలోని ఆరేపల్లి, యూసఫ్‌పేట్, కొత్తపల్లి, లక్ష్మీనగర్, లక్ష్మీనగర్ తండా, అబ్లాపూర్, అన్నారంతో పాటు మరికొన్ని గ్రామాలకు నీళ్లు రావడం లేదు. ఈ విషయమై భగీరథ వారిని అడిగితే ట్రాన్స్‌కో వారు పైపులైన్ వేయాలంటున్నారన్నారు. ట్రాన్స్‌కో వారిని అడిగితే మిషన్ భగీరథ వాళ్లు చేయాలంటున్నారని శ్రీనాథ్ వాపోయారు.

◆ చెక్కులు అందజేత

మనోహరాబాద్(తూప్రాన్): జాతీయ రహదారి–44 రోడ్డు విస్తరణలో భాగంగా 2006లో భూములు కోల్పోయిన బాధితులకు హైకోర్టు ఆదేశాలతో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి చెక్కులు అందజేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాల భూ బాధితులకు 76 మందికి చెక్కులను అందజేశారు.కార్యక్రమంలో ఆర్‌ఐ దీక్షిత్, తదితరులున్నారు.

◆ కబ్జా నుంచి మా భూములు కాపాడండి బీడీ కార్మికుల నిరసన

మెదక్ కలెక్టరేట్: కబ్జా దారుల నుంచి తామ భూములను కాపాడాలని కోరుతూ మండలంలోని నస్కల్ గ్రామ బీడి కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మెదక్ కలెక్టరేట్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపి, అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకురాలు బాలమణి, సంజీవులు, బాధిత బీడీ కార్మికులు పాల్గొన్నారు.

◆ అపోలో ట్యూబ్స్ పరిశ్రమతో జల కాలుష్యం

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం గ్రామ శివారులోని అపోలో ట్యూబ్స్ పరిశ్రమతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరిశ్రమ వదులుతున్న వ్యర్థాలతో భూగర్భ జలాలు రంగు మారి పంటలు పండని పరిస్థితి నెలకొంది. ఈ విషయంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలో ఫిర్యాదు చేయగా అధికారులు నీటి నమూనాలు సేకరించి ఏడాది గడుస్తున్నా ఇంతవరకు అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. మరోవైపు పరిశ్రమ శివారులోని వ్యవసాయ పొలాల్లో పంటలు పండటం లేదని రైతులు కూడా ఫిర్యాదులు చేశారు. ఈవిషయంలో అధికారులు స్పందించి నీటి కాలుష్యంతో పంట నష్టం జరుగుతున్న రైతులకు పరిశ్రమ యాజమాన్యం పరిహారం అందించేలా చూడాలని డిమాండ్ చేశారు.

◆ పుస్తకాల విక్రయం నిలిపివేత

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట దీప్తి విద్యాలయంలో అధిక ధరలకు పుస్తకాలు అమ్ముతున్నారనే ఫిర్యాదుతో విద్యాశాఖ అధికారులు పుస్తకాల విక్రయాన్ని నిలిపివేశారు. ఇదే విషయమై ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు నవీన్, ప్రవీణ్ ఎంఈఓకు ఫిర్యాదు చేసి సోమవారం పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. స్పందించిన ఎంఈఓ బుచ్యానాయక్ మండల నోడల్ అధికారి నీరజ పాఠశాలను పరిశీలించి పుస్తకాల విక్రయాలను నిలిపివేయించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంఈఓ తెలిపారు.


◆ సభను జయప్రదం చేయండి

మెదక్ మున్సిపాలిటీ: జూలై 7న వరంగల్‌లో నిర్వహించే ఆత్మగౌరవ కవాతు సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోమవారం మెదక్‌లోని టీఎన్జీఓ భవన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు, ప్రధాన కార్యదర్శి రవి సంయుక్తంగా మాట్లాడారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఏర్పడి జూలై 7 నాటికి 30 ఏళ్లు పూర్తి చేసుకుంటుందని తెలిపారు.

◆ రూ.4.63లక్షలకు తైబజార్ వేలం

కొడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కొడిపల్లిలో రూ. 4.63లక్షలకు తైబజార్ వేలం నిర్వహించారు. సోమవారం గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మార్చి 2025 వరకు తైబజార్ వసూలు కోసం వేలంపాట నిర్వహించగా, గ్రామానికి చెందిన పలువురు రూ. 10వేలు డిపాజిట్ చేసి వేలంపాటలో హాజరయ్యారు. కాగా గ్రామానికి చెందిన ఎస్‌కే శఫియొద్దీన్ రూ. 4.63లక్షలకు వేలంపాటను దక్కించుకున్నాడు. గత ఏడాది రూ 6.15లక్షలకు వేలం అయింది. ప్రభుత్వ అనుమతి ఉన్న వాహనాలకు డబ్బులు వసూలు చేయొద్దని ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ వెంకటేశం, ఏపీఓ పుణ్యదాస్, కారోబార్ ఎల్లం, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ నారు కొనలను కత్తిరించాలి



చిన్నశంకరంపేట(మెదక్): ఆలస్యంగా వరి నాట్లు వేసే రైతులు నారు కొనలను తుంచి వేయాలని రామాయంపేట ఏడీఏ వసంత సుగుణ అన్నారు. సోమవారం నార్సింగి మండలంలోని జప్తిశివనూర్ గ్రామంలోని వరి నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆశించిన వర్షాలు లేకపోవడంతో వరినాట్లు ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు. ఏపుగా పెరిగిన నారును వరినాట్లు వేస్తే మొగిపురుగు పంటను నాశనం చేసే అవకాశం ఉందన్నారు. రైతులు ముందుగానే నారు కొనలను తొలగించాలన్నారు. ఎకరం వరి నారుకు 250 గ్రాముల క్లోరిపైరిఫాస్ పిచికారీ చేయాలని కోరారు. ఎలాంటి అనుమానం ఉన్న, పంటల సాగుకు సూచనల కోసం వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు. ఆమె వెంట ఏఈఓలు విజృంభణ, దివ్య, రైతులు ఉన్నారు.